## చిల్లర దేవుళ్ళు, చిన్న చిన్న రాళ్ళు

ఓసారి రామారావూ నేను కాఫీ హోటలు కెళ్ళాం. బిల్లు ఇవ్వడం దగ్గర మామూలుగానే పేచీ వొచ్చింది. (అదే-అతనిస్తాడని నేనూ, నేనిస్తానని అతనూ మనస్సుల్లో అనుకుని, పైకి మాత్రం నేనిస్తానంటే నేనే యిస్తానని అనడం అన్నమాట) అతను 20 రూపాయల నోటు తీశాడు. "1-80 కి అంత నోటెందుకు" అంటూ నేను రెండు రూపాయల నోటు తీశాను. "చిల్లర కావాలి" అంటూ అతను ముందుకెళ్ళాడు. ఇతనికి చిల్లర కావల్సినట్టే హోటలాయనికి టోకు కావల్సివచ్చింది కాబోలు, నా కేసి చూస్తూనే రామారావుని గెలిపించాడు.

"చిల్లర లేదు" అన్న బోర్డులు అక్కడక్కడ దర్శనమిస్తూనే వుంటాయి. "చిల్లరున్నవారే బస్సెక్కండి" అన్న స్లోగన్‌లు వినిపిస్తూనే వుంటాయి. వీటిమధ్య రామారావు "చిల్లర దేవుడు"గా నాకు కనిపిస్తాడు.

ఓ మారు రామారావుకి తలనొప్పి వచ్చింది, ఆఫీసుకు వస్తుంటేను. బస్‌స్టాప్‌లో కిళ్ళీ దుకాణం దగ్గిర నిలబడి "ఒక ఆస్ప్రో బిళ్ళ ఇవ్వు" అన్నాడు. మాత్ర చేతిలో పడగానే లటుక్కున మింగేసి, ఫ్లాస్కులో కాఫీ కొద్దిగా మూతలో వొంపుకుని గుటకేసి, దుకాణంలోకి రూపాయినోటు విసిరాడు. "చిల్లర లేదార్" అన్నాడు కుర్రాడు. రామారావు జేబులన్నీ వెతికి ఓ రూపాయి బిళ్ళ తీశాడు. "చెప్పాను కదండీ, చిల్లర లేదని?" అని కుర్రాడు బిగిశాడు. "నోటు పాతదని

అన్నావని రూపాయిబిళ్ళ యిచ్చాను. దీనికీ లేదా, చిల్లర ?" అని డబాయించి, ప్రొప్రయిటర్ని కేకేసి, గల్లాపెట్లో వున్న రెండు కేజీల చిల్లర బైటికి తీయించి, కుర్రాడి ఉద్యోగం వూడగొట్టినంత పని చేశాడు రామారావు.

రామారావు చిల్లర ఏం చేస్తాడో నాకు తెలీదు. కాని, చిల్లర సంపాదించడంలో అతని నేర్పు మిక్కిలి శ్లాఘనీయం!

సిటీ బస్సెక్కి, చుట్టుపట్ల వాళ్ళందరూ టిక్కెట్టు కొన్నారో లేదో చూసేస్తాడు. సీటు కావల్సిన వాడిలాగా "మీ రెక్కడికి?", "మీ రెంత వరకు?" అంటూ భోగట్టా చేస్తాడు. అప్పటిదాకా టిక్కెట్లు కొనని వాళ్ళని ఒకర్నో యిద్దర్నో పోగుచేసి, వాళ్ళ టిక్కెట్లకి సరిపడా చిల్లర వొసూలుచేసి కండక్టర్ వచ్చేవేళ్ళకి ఐదురూపాయల నోటో పది నోటోతీసి "రెండు పదిహేన్లు, ఒక పావలా" అంటాడు. "చిల్లరలేదు, దిగిపోండి" అనగలిగే కండక్టర్ కూడా విధిలేక ఇతనడిగిన టిక్కెట్లు, యితనికి రావల్సిన చిల్లరా యిస్తాడు. ఇలాంటి ప్రయత్నాల్లోనే బస్సులో ఎక్కి, కండక్టర్ని ఏమార్చి అసలు టిక్కెట్ కొనకుండా దిగపోయే ఘటాల్ని పట్టానని చెబుతాడు.

మార్కెట్లో కరివేపాకు, కొత్తిమిరి, తమలపాకులు అమ్మే ఒకమ్మాయి రామారావు పాలిట "చిల్లర దేవత." అతనికి ఆ మూడూ కావాలి. కాని అతని స్కీమే వేరు! మార్కెట్లోకి వెళ్ళగానే "20 పైసల తమలపాకులు" అని రూపాయి ఇస్తాడు. మళ్ళీ కొన్ని కూరలుకొని అక్కడికొచ్చి "10 పైసల కరివేపాకు" అని మళ్ళా రూపాయి చూపుతాడు. చివర్న వెళ్ళిపోతూ, "అన్నట్టు 10 పైసల కొత్తిమిరి ఇవ్వు!" అని మూడోసారి కూడా రూపాయే ఇస్తాడు. కుళ్ళు నోట్లు వదల గొట్టడానికి ఇదే శ్రేయస్కరమైన మార్గం అని రామారావు ఉవాచ.

రైలు స్టేషన్లో ప్లాట్‌ఫారం టిక్కెట్ల దగ్గిర ఇతని పప్పు ఉడకవు. "మూడు ప్లాట్‌ఫారం టిక్కెట్లు-" అన్నాడనుకోండి. "తొంభై పైసలివ్వండి" అంటాడే తప్ప రూపాయిని ఆనర్ చెయ్యడు అక్కడి

ఉద్యోగి. వాల్తేరునుంచి విజయవాడకి 16-80 అనుకోండి. ఎనభై పైసల చిల్లర యివ్వవలసిందే. లేకపోతే సీటు వెతుక్కునే హడావిడిలో 20 పైసలూ వదిలేసిపోవాలి.

అలాగే పోస్టాఫీసులో కూడాను. "రెండు కార్డు లివ్వండి" అనో, లేక "మూడు ఇన్లాండు కవర్లివ్వండి" అనో రూపాయి చూపిస్తే అక్కడి ఉద్యోగస్తులు నాగుపాముని చూసినట్టు వెనక్కి పారిపోతారు. అంచేత రామారావు అక్కడ, "అయిదు కార్డులు, ఒక కవరు" లేక "నాలుగు కార్డులు రెండు ఇన్లాండు లెటర్సు" అని, ఇలాగ రూపాయికి సరిపడే బేరం మాత్రమే చేస్తాడు.

కుటుంబంతో సహా యాత్ర తలపెట్టాను మధ్యలో పిల్లలు వేరుశనగపప్పు, జామికాయలు- ఇలాంటి వేవో కొనమని గొడవ చేస్తారు. గంటకోసారి మా ఆవిడ కాఫీ కావాలంటుంది. కదలడానికి సిద్ధంగావున్న రైల్లోంచి రూపాయి అందించి అట్నుంచి చిల్లర రాక బాధపడవలసి వస్తుందని; అవసరార్థం ఓ ఐదు రూపాయల చిల్లరైనా రెడీగా వుంచుకుందికి నిశ్చయించాను. నిత్యం గలగల లాడుతూ ఇల్లు చేరే రామారావు గారింటికెళ్ళి వారి అర్ధాంగి శ్రీమతి చిల్లర శ్రీ మహా లక్ష్మిగార్ని అడుగుదామని బయలుదేరాను.

నేను వెళ్ళేసరికి అక్కడ హోటల్ యూనిఫారంలో ఓ కుర్రాడు ఒక సంచిలో పొట్లాలు పెట్టుకుని కదలడానికి సిద్ధంగా వున్నాడు. ఆవిడ అంటున్నది: "అయిదు పైసల నాణాలు నలభై రూపాయలవి, పదిపైసల నాణాలు ఇరవై రూపాయలవి, అర్ధలూ, పావలాలూ కలిపి నలభై రూపాయలవి మొత్తం వందరూపాయలైనై. నువ్విచ్చింది నూట అయిదు రూపాయలు, సరిపోయింది."

అంచేత నేను వచ్చిన పని చెప్పకుండా రామారావుగారికి చెప్పండి. "మేం యాత్ర కెడుతున్నాం, మళ్ళా పదిహేను రోజుల్లో వస్తాం" అని చిల్లర శ్రీ మహాలక్ష్మిగారికి మనవి చేసి తిరిగొచ్చేశాను.

(24-2-79)